# అందం

"వాడు నాకు నచ్చలేదు – ఈ సంబంధం క్యాన్సిల్ చేయండి !" ముక్కు సూటిగా చెప్పింది మాధవి.

" వాడికేం తక్కువయిందే – బ్రహ్మాండమైన సంబంధం ! మనం తల తాకట్టు పెట్టి వెయ్యేళ్ళు తపస్సు చేసినా అంత గొప్ప సంబంధం తెచ్చుకోలేం – ఏ పూర్వ జన్మ సుకృతం వల్లనో వాళ్ళే వెతుక్కుంటూ మనింటికి వచ్చారు." లబలబ వాపోయాడు ఆమె తండ్రి నరహరి.

" మాధవి ! రోజు రోజుకు నీకు మొండి తనం ఎక్కువైపోతున్నది – ఏదో ఆడపిల్లవని నీ మాటకు ఎదురు చెప్పకుండా అల్లారు ముద్దుగా పెంచితే – ఈ రోజు మాకు తలవంపులు తెస్తున్నావు !" నిష్ఠూరంగా అంది లక్ష్మీదేవమ్మ.

"థ్యాంక్స్ ! కాని నచ్చని సంబంధం ఎలా చేసుకోను ?"

" ఎందుకు చేసుకోకూడదు – మీ నాయన నాకు నచ్చాడని చేసుకున్నానా ? ఎవడో ఒక గొట్టం గాడు అయితే చాల్లే అని నాన్న చెబితే ఈయన్ని చేసుకోలేదా? నాకు దేవానంద్ లాంటి వాడిని చేసుకోవాలని ఉండేది – కాని మనం నర్గీస్ లాగా లేం కదా !" చెప్పింది తల్లి.

"నిజమే ! నువ్వు అందంగా ఉండవు – మనం అని నన్ను ఎందుకు కలుపుకుంటావు – నీకాలం వేరు, నాకాలం వేరు – నా పర్సనాల్టి వేరు – నీది వేరు – నీ అందం వేరు – నా అందం వేరు – " గర్వంగా చెప్పింది మాధవి.

" అందం ! అందం ! ఏం కొరుక్కు తింటారా ? అందం శాశ్వతమా ?" తండ్రి మండి పడ్డాడు.

" మరి డబ్బు శాశ్వతమా ?" మాధవి అడిగింది.

" ఆ! ఉన్నంతలో అదే శాశ్వతం – ఇంకా పిల్లల్ని కూడ పెడుతుంది." తండ్రి చెప్పాడు.

" డబ్బుంటే సుబ్బమ్మనే సుబ్బలక్ష్మి గారు అని గౌరవిస్తారు – " తల్లి చెప్పింది.

" కాదంటం లేదు – అందుకని అయోగ్యుల్ని చేసుకోవాల్సిన ఖర్మ నాకు పట్టలేదు. నేను 'యస్' అన్నానంటే ఎంతో మంది కాళ్ళ మీద పడతారు. ఈ లోకంలో

అందం కున్న విలువ యింక దేనికీ లేదు." మాధవి గట్టిగా చెప్పింది.

" ఒసే – మనం ఫ్యామిలీ లేడీసుమే – నువ్వు చెప్పే విలువ వేరే సెక్సు వ్యాపారం చేసే వాళ్ళకు – " తల్లి తల బాదుకుంది.

" గులాబీ పువ్వు ఎక్కడున్నా విలువైందే – ఎక్కడున్నా గుబాళిస్తూనే ఉంటుంది. ఫ్యామిలీ లేడీసు అయినా అందంగా ఉంటే ఆకతే వేరు !"

" నీ అహంకారమే నిన్ను సర్వనాశనం చేస్తుంది. పెద్దవాళ్ళం చెబుతున్నాం విను – అయినా నువ్వు ఒప్పుకునే దేంటి – మేము ఈ పెళ్ళి జరిపిస్తాం?" తండ్రి కోపంగా చెప్పేశాడు.

" అట్లాగా – అయితే ఈ పెళ్ళి జరిగేది నాక్కాదు – నా శవానికి – " హెచ్చరించింది మాధవి. మాధవి పట్టుదల వాళ్ళ తల్లిదండ్రులకు తెల్సు.

" హూ ! అదృష్టం అందలం ఎక్కిస్తూ వుంటే బుద్ధి బురదలోకి లాగుతుందని ఊరికే అన్నారా ! రేపొద్దున నీ జీవితం ఏమైనా నాదికాదు బాధ్యత." తేల్చి చెప్పేశాడు తండ్రి.

" ఆ ! చూస్తూనే ఉన్నాగా – ముప్పయి దాటిన అన్నయ్య గురించి మీరేం పట్టించుకుంటున్నారో – వాడికి మంచి ఉద్యోగం యిప్పించలేక పోయారు – పెళ్ళి చేయలేక పోయారు. " దెప్పి పొడిచింది – మాధవి

" దాంలో మా తప్పేముంది .... కోరికలు గుర్రాలయితే – ఆశలు అంతస్తులు దాటితే మేం ఏం చెయ్యగలం ? వాడిని చదువు మానమని మేం చెప్పలేదు – అల్లరి చిల్లరిగా తిరగమని మేం చెప్పలేదు – బిటెక్కులు – యమ్‌టెక్కులు డిస్టింక్షన్ లో పాసయిన వాడికే ఉద్యోగాలు లేకపోతే ఇంటర్ తప్పిన మీ అన్నకు – ఉద్యోగాలు ఎవరిస్తారు ? అది గవర్నమెంటు ఉద్యోగం కావాలిట ! అంతే ! మీ యిద్దరూ తల్లి దండ్రులను నిందించి సర్వనాశనమై పోతారు." శపించాడు తండ్రి.

ఇంతకీ కథ ఏంటంటే మాధవిది అద్భుతమైన అందం ! చూసిన వాళ్ళంతా 'ఏమందం? ఏమందం? ఏమందం?' అని ఆశ్చర్య పోతారు. బంగారానికి తావి అబ్బినట్లు కాస్త చదువు తెలివి తేటలున్నాయి – కాని సరియైన గైడెన్సు లేక పోవడం

వలన మామూలుడిగ్రీ చేసింది – అందంపైనే ఎక్కువశ్రద్ధ కనపరచడం వలన చదువుకు తక్కువ సమయం కేటాయించేది... చదువు గురించి పెద్దగా సీరియస్సుగా తీసుకోలేదుకూడా.

నిజం చెప్పాలంటే ఆ యింట్లో చదువు వాతావరణం తక్కువ. తండ్రి మిత్రులతో పేకాడ్డం చేస్తాడు ఖాళీ సమయాల్లో – సీజనులో పొలం పనులలో మునిగి పోయి ఉంటాడు– తల్లి రామాయణ – భారత పఠనాల్లో – హరికథా కాలక్షేపాలతో కాలం వెళ్ళ దీస్తుంది. ఇల్లు ఇరకటం – అలి మర్కటం లాగా రెండు గదుల కొంప! ఎప్పుడూ టీవి ఆన్‌లో ఉంటుంది... పైగా వచ్చేవాళ్ళు పోయే వాళ్ళు – చుట్టాలు – స్నేహితులు.

ఆమె అన్నయ్య నరసరాజుకు చదువు మీద కంటే ఆటల మీద శ్రద్ధ ఎక్కువ. దాన్ని గమనించి వాళ్ళ తండ్రి ఆరంగంలో దింపినా బాగుండేది. ఆయనకి అన్ని తెలివితేటలు – డబ్బులు లేవు – వారిది మధ్య తరగతి కుటుంబం నరసరాజుకు ఆటలే కాకుండా – డ్రామాల పిచ్చి కూడ జాస్తి – దాంలో చదువు అటకెక్కింది.

పెద్దయింతర్వాత ఉద్యోగాల కోసం నానా తిప్పలు పడుతున్నాడు. ఏదో చిన్నా చితక పన్లు చేస్తాడు. ఎక్కడా కుదురుగా ఉండలేడు – ముదిరిన బెండకాయ ! ఎన్నో సంబంధాలు చూశాడు – నచ్చలేదు – ఇతనికి నచ్చిన సంబంధాల వారికి ఇతను నచ్చలేదు.

"నాకెలాగూ ఉద్యోగం లేదు – కాస్త మంచి గవర్నమెంటు ఉద్యోగం ఉన్న అమ్మాయిని చేసుకుంటాను –" అంటూ భీష్మించుకు కూర్చున్నాడు.

ఓ మాదిరి గవర్నమెంటు ఉద్యోగం చేసే అమ్మాయిలకు ఆశలు కోటలు దాటుతాయి – ఇతను కంటికి ఆనే వాడు కాదు.

అప్పటికీ అతను అందం ఏం చేసుకుంటాంలే – కాలు కన్ను – ముక్కు ఉంటే చాలనుకున్నాడు. కాని అలా అవతలి వాళ్ళు అనుకోవడం లేదు. ఉద్యోగం లేని అమ్మాయిల్ని పురుగుల్ని చూసినట్లు చూసేవాడు– కాస్త కట్నం ఎక్కువగా యిస్తానన్నా – కట్నం శాశ్వతం కాదు – మనకు ఏమీ మిగలదు – జీవితమంతా కష్టపడుతూ బ్రతకాలి అనుకుని తిరస్కరించేవాడు అలా అతను మంచి ప్రాయంలో

వున్నప్పుడు ఎన్నో సంబంధాలు తిరస్కరించాడు. ఇప్పుడు సంబంధాలు రావడం కష్టమయిపోతున్నది – ఆ చుట్టు ప్రక్కల వాళ్ళందరికి అతని పేరు తెల్సి పోయి – ఎవరన్నా అతన్ని చూడ్డానికి పోబోయినా కొందరు 'దండుగ' అని ముందే నిరుత్సాహ పరిచేస్తున్నారు. అతనికి చేసుకునే ఉద్దేశం లేదని చెడగొడుతున్నారు.

ఇంక మాధవికి నరసరాజుకు మధ్య పన్నెండేళ్ళ అంతరం ఉంది. అన్నయ్య అంటే ఆమెకెంతో యిష్టం – ప్రేమ ! అతను అలా అయిపోవడానికి కారణం తల్లిదండ్రుల పెంపకలోపం అని ఆమె ప్రగాఢ విశ్వాసం ! అందుకోసమే ముందు అన్నయ్యకు చెయ్యండి – ఆ తరువాత నాకు – అది న్యాయం అని తల్లిదండ్రుల మీద పోరాటం జరిపింది.

" వాడితో పెట్టుకుంటే నీకీ జన్మలో పెళ్ళి కాదు – వాడు ఐరన్ లెగ్గు." అంటూ తల్లి మందలిస్తూ ఉండేది.

" మొగాడు ఎలాగైనా ఊరేగుతాడు – కాని ఆడపిల్లకు వయసొచ్చింతర్వాత పెళ్ళి చెయ్యక పోతే మామొహాన ఉమ్మేస్తారు. పొరపాట్న కాలు జారితే మేము ఆత్మహత్య చేసుకోవాల్సిందే!" అని తండ్రి ఆశీర్వదిస్తూ ఉంటాడు.

" అలా జారేదాన్నయితే ఎప్పుడో జారేదాన్ని – నా వెంటపడని వాళ్ళెవరు?" అంటూ తేలిగ్గా తీసిపారెస్తుంది మాధవి.

ఆ మాట వాస్తవమే!

పదిహేనేళ్ళ కుర్రాడి దగ్గర్నుండి – కాటికి కాళ్ళు చాపుకున్న ముసిలాడి దాకా ఆమెను కన్నార్పకుండా చూసే వాళ్ళే ! ఆమెను చూస్తూ ఆమె టీచర్లు – లెక్చరర్లే పాఠాలు చెప్పడంలో తడబడే వాళ్ళు.

ఐరన్ లెగ్గు నరహరి కోసం చాలా మంది ఇంటికి వస్తూండే వాళ్ళు – అతనికి ఎక్కడ లేని ప్రాముఖ్యత యిచ్చేవాళ్ళు – అదంతా తనను చూడ్డానికే నని తొందర్లోనే గ్రహించింది.

ఎదురింటి అంకుల్, పక్కింటి బాబాయ్, వెనకింటి తాతయ్యలు కూడ పేపరు కోసమని – సిడీ కోసమని – ఎదో ఒక వంకతో ఒక సారన్నా వాళ్ళింటికి వచ్చి ఆమెను పలకరించి వెళుతూ ఉండేవాళ్ళు.

'ఏ థింగ్ ఆఫ్ బ్యూటి ఈజ్ ఎ జాయ్ ఫర్ ఎవర్' అని కీట్సు అన్నా-'అందమే ఆనందం' అని ఘంటసాలపాడినా అవన్నీ ఆబ్రహ్మ సృష్టికి నీరాజనాలే కదా !

కాలేజీలో అయితే ఆమె కను సైగ కోసం వెంపర్లాడని కుర్రకారు ఉండేవారు కారు - మాధవికి కొన్ని సామెతలు బాగా వస్తాయి - అందులో ఆమెకు బాగా నచ్చిన సామెత 'అందిన ద్రాక్ష పళ్ళు పుల్లన - అందని ద్రాక్ష పళ్ళు తియ్యన' అని అందుకే ఎవరికీ అందకుండా తప్పించుకు తిరుగుతూ ఉండేది. అట్లాగని మడి గట్టుకుని కూర్చుంటే - తనకు విలువ ఉండదు కాబట్టి - అప్పుడప్పుడు ఓ చిరునవ్వు - ఓ క్రీగంటి చూపు విసురుతూ ఉండేది. న్యూటన్ మొదటి చలన సూత్రం ఆమెకు బాగా నచ్చింది. ఎవరూ తన ఆకర్షణ పరిధి నుంచి తప్పించుకు పోకూడదు. అందరూ సూర్యుడి చుట్టూ గ్రహాల్లా వారివారి కక్షల్లోనే పరిభ్రమిస్తూ ఉండాలి తన చుట్టూతా. ఆ చాకచక్యం ఆమెకు బాగా తెలుసు.

ఓ ముగ్గురు ఆత్మహత్యలు కూడ చేసుకున్నారు ఆమె తనను పెళ్ళి చేసుకోలేదని- అటువంటి వారి గురించి ఆమెకు యిసుమంతయినా జాలిలేదు.

" అంత బలహీనులైతే మనమేం బాగుపడతాం - ఈ రోజు నేను అందలేదని చేసుకుంటాడు- రేప్రొద్దున నేను అందినా - నాకంటే అందగత్తె దొరికితే ఆమె కోసం ఆత్మహత్య చేసుకోడని గ్యారెంటి ఏంటట? నిండలేంది బొంది పోదు - చావడానికి ఏదో ఒక కారణం ఉండాలి కాబట్టి నన్ను చూపించాడు అంతే !"

కొన్ని అద్భుతమైన సంబంధాలు - యువకులు ఆమె కరుణా కటాక్షాల కోసం వీక్షించి వీక్షించి విసుగు చెందారు కూడ పద్ధతి ప్రకారం వారి తల్లిదండ్రుల ద్వారా పెండ్లి చూపులు వగైరా తంతు జరిపించినా కూడ మాధవి అంగీకారం పొందలేక పోయారు.

ఆమె అంతర్యం ఎవరికీ అంతు బట్టదు కాని రాధ మటుకు ఓ మాట అంటుంది. రాధ ఆమెకు మంచి నేస్తం -" తొందరపడి ఇతన్ని చేసుకుంటే - రేపొద్దున యితని కంటే మంచి వరుడు వచ్చినప్పుడు మనం విచారించాల్సి వస్తుందిట!"

" అయినా యిప్పుడేం వయసు మించి పోయిందని పెళ్ళి చేసుకోవడానికి ! పెళ్లి పెళ్ళి అంటూ ఈ మొగాళ్ళు వెంటపడతారు - తర్వాత అస్సలు ఆగలేరు - పది

నెలల్లో తల్లిని చేసేదాకా నిద్ర పోరు – ఆ తరువాత వారికి పెళ్ళాంమీద మోజు తగ్గిపోతుంది. ఆడాళ్ళకు కాన్పు అయితే అందం తగ్గి పోతుంది. ఇంక పిల్లా పీచు – వంట – పెంట అంటూ ఒకటే న్యూసెన్సు – ఇంక జీవితంలో సాధించేదానికి ఏమీ మిగలదు – ” అంటూ మాధవి ఎక్కడో ఉపన్యాసం యివ్వగా విందీ రాధ.

రాధ ఇప్పుడు ఇద్దరు పిల్లల తల్లి కూడ ! –

మాధవి తనను తిరస్కరించిందని తెల్సుకుని కిషోర్ బాబు లబలబ లాడుతూ పరుగెత్తుకుంటూ వచ్చాడు నరహరి దగ్గరకు.

“ అంకుల్ ! ఇదేం న్యాయం ! నేనేమన్నా కట్నం అడిగానా ? కండీషన్లు పెట్టానా – అస్సలు మా అంతస్తు ఎక్కడ ? మీ అంతస్తు ఎక్కడ – నాకు యాభైలక్షలు కట్నం యివ్వడానికి అమ్మాయిలు క్యూలో నిల్చున్నారు అటువంటిది వారినందరిని కాదని – ఏమీ ఆశించకుండా మీ సంబంధం కోసం వచ్చానని చులకన అయిపోయానా?” బాధగా అడిగాడు.

“ బాబూ! మా అందరికీ యిష్టమే ! దానికే లేదు.” లక్ష్మీదేవమ్మ బాధపడ్తూ చెప్పింది.

“ అదే ఎందుకని అడుగుతున్నా !” డబ్బుంటే చాలు అందరూ ఎగపడతారని అతని నమ్మకం.

“ పుర్రెకోబుద్ధి – జిహ్వకో రుచి !” చెప్పాడు నరహరి

“ నాకేం తక్కువ ! నా అంతస్తు, నా ఆస్తి, నా వ్యాపారం కొండమీద కోతినైనా కిందకు తెప్పిస్తాయి – ” వాపోయాడు కిషోర్.

“ ఇంకేం ఆ కొండమీద కోతినే చేసుకోండి – నాకోసం ఎందుకు దేబిరించడం?” లోపలనుండి బయటకు వస్తూ చెప్పింది మాధవి.

తలంటి పోసుకుని, జుత్తు వెనక్కి వదిలేసి – పట్టు చీరలో శ్రీ మహాలక్ష్మిలాగా వున్న ఆమెను చూడగానే చేష్టలుడిగి పోయాడు.

“ ఏమీ ఆశించకుండా చేసుకుంటానంటున్నారు – నిజమేనా?” అడిగింది చిరునవ్వుతో

"నాకు పైసా అక్కరలేదు." గుటకలు మింగాడు – కిషోర్.

" కిషోర్ గారు – ఆశించడం అన్నది ఒక్క ధనం మాత్రమే కాదు మనకు లేని దాన్ని ఇతరులనుండి ఆశిస్తాం" చెప్పింది తాపీగా మాధవి.

" అయ్యో ! నాకు లేనిది ఏముంది కనుక ? అర్థం కాలేదు –నాకు అన్నీ ఉన్నాయి ." చెప్పాడు ఆలోచిస్తూ.

"ఒక్క అందం తప్ప !" మాధవి నిర్మొహమాటంగా చెప్పింది.

" యూమీన్ – నాకు అందం లేదా?" తడబడి పోయాడు తన సూటువంక చూసుకుంటూ.

" అలంకరణ సహజ శోభను పెంచుతుందే కాని – నిజమైన అందం యివ్వలేదు. నేను అందగత్తెను అనే కదా మీరు యాభై లక్షల కట్నంకూడ వద్దనుకుంది. అదే నాకు కొంచెం అందం తగ్గినా మీరు అంత త్యాగం చేయగలరా కిషోర్ బాబు గారు !" వ్యంగ్యంగా అడిగింది మాధవి.

"అట్లానికాదు – నువ్వు నాకు బాగా నచ్చావు !" చెప్పాడు తలొంచుకుని

" ఆ నచ్చడానికి కారణాలు ఆలోచించండి .." మాధవి చెప్పింది అతనికి మంచినీళ్ళు అందిస్తూ. " అయినా మా అన్నయ్యకు పెళ్ళయ్యే దాకా నే చేసుకోదల్చుకోలేదు. పెద్ద వాడు వాడుండగా నాకు పెళ్ళేంటి – మా వాళ్ళకు బుద్ధిలేదు.."

" సరే ! మీ అన్నయ్యకు పెళ్ళయ్యే దాకా నన్ను వెయిట్ చేయమంటారా? ఇప్పటికే మా వాళ్ళు నాకు పెళ్ళి ఆలశ్యం అయిపోయిందని ఒకటే గోల పెడుతున్నారు." నిరాశగా అడిగాడు.

"అది మీ యిష్టం ! ఖచ్చితంగా చెప్పలేను – ఆరోజు పరిస్థితుల బట్టి నిర్ణయించుకుందాం – ఛాయిస్ ఈజ్ ఓపెన్ ! మీకు నాకంటే మంచి అందగత్తె దొరకచ్చు – లేదా నాకు మీ కంటే మంచి ఐశ్వర్యవంతుడు దొరకచ్చు !" కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది.

కిషోర్ బాబు ఆ మాటలకు షాక్ తిని తనకోసం క్యూలో వున్న మొదటి అమ్మాయిని చేసేసుకున్నాడు.

ఇలా వచ్చినవన్నీ పోతుండగా - ప్రపంచ వింతలాగా ఆమె అన్నయ్యకు పెళ్ళి కుదిరింది తిరుపతిలో.

సంతోషంగా పెళ్ళి చేసుకుని తిరిగి వస్తూండగా బస్సు బోల్తా కొట్టింది. ఎవరికీ ఏమీ కాలేదు కాని - మాధవికి మొహం మీద దెబ్బలు తగిలాయి. అవి మానడానికి రెండు నెలలు పట్టింది... కాని మచ్చలుండి పోయాయి వికారంగా

ఆ తరువాత - అలర్జీ పట్టుకుంది ... ఎన్నో మందులు వాడింది.. ఎలర్జీ అయితే కొంచెం తగ్గింది కాని - మందుల రియాక్షను వలన బాగా లావై పోయింది.

నరహరి ఆమె కోసం సంబంధాలు వెతకసాగాడు.

కాని వచ్చిన పెళ్ళి కొడుకులు ఆమెను చూసి పారిపోతున్నారు.

" మా యింట్లో గుమ్మాలు చాలా చిన్నవండి బాబు - ఇప్పుడు వాటిని వెడల్పు చేయడం మావల్లకాదు" అని ఒకతను పారిపోతే-

" నేను బక్కగా ఉంటాను - ఆమె చెయ్యి పొరపాట్న నా మీద పడితే పచ్చడై పోతాను" అని ఇంకోడు అధైర్య పడ్డాడు.

" అయినా ఈ వయసులో ఈమెకు పెళ్ళి ఎందుకు - " అని కొందరు వికారంగా ఉంది" అని కొందరు వ్యాఖ్యానించారు

కాలేజి రోజుల్లో వెంటబడ్డవాళ్ళు కూడ ఇప్పుడు ఆమె కన్పించినా పని వున్నట్లు పారిపోతున్నారు.

నరహరి, లక్ష్మీదేవమ్మలకు ఆమె గుండెలమీద కుంపటిలా తయారైంది. వదినమ్మ ఆండాళ్ళు తరచు ఆమెకు పనులు చెప్పడం - తన పిల్లల్ని ఆడించమని - ఎత్తుకోమని డ్యూటీలు వేయడం చేస్తున్నది...

ఇప్పుడు మాధవిని ఎవరి చూపు వెంటాడటం లేదు

గతం మటుకు గుర్తొచ్చి తను తప్పు చేశానా అని చింతిస్తూ ఉంటుంది.

( ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక 29-12-2005)